

# రుధిర సంగ్రామం

– పొత్తూరు రాజేంద్ర ప్రసాద్ వర్మ



## (ప్రారంభం)

వాస్తవంగా జరిగిన పద్మనాభ యుద్ధంలో సంఘటనలు, చారిత్రక అంశాలను క్రోడీకరించి ఆనాటి రాజకీయ సాంఘిక నేపథ్యాలను ఆధారంగా చేసుకుని సంఘటనలను అల్లుకుని రాసిన చారిత్రక నవల. వ్యక్తులు ప్రదేశాలు సన్నివేశాలను కథారూపంలో తయారు చేయడం జరిగింది. యుద్ధం జరగడం వెనుక కారణాలను వివరించడానికి కథారూపంలో విస్తరించడం వల్ల పాఠకులు సులభంగా చదువుకోవడమే కాకుండా చరిత్రలో మరుగున పడిపోతున్న క్షత్రియుల పోరాట పటిమకు, పౌరుషానికి, బ్రిటిష్‌వారి సార్వభౌమత్వాన్ని ధిక్కరించి, ఎదిరించి నిలిచి వీరోచితపోరాటం చేసినవారి స్ఫూర్తిని తెలియజేయడానికి నవలారూపంలో రాసిన చారిత్రక సంఘటనల మాలిక ఈ రుధిర సంగ్రామం.

పరాయిపాలకుల దాస్య శృంఖలాలను తెంచుకోవాలని ప్రాణాలొడ్డి పోరాటాలు చేసిన ఎంతోమంది వీరులు ఉత్తరాంధ్ర జిల్లాలో ఉన్నారు. బ్రిటిష్‌వారి దాష్టీకాలను ఎదుర్కోవడానికి వీరోచితమైన యుద్ధం చేసి అసువులు బాసిన ఎంతోమంది వీరాధివీరుల్లో చిన విజయరామరాజు ఒకరు. విజయనగర సంస్థానానికి చెందిన ఈయన ఉత్తరాంధ్ర జిల్లాలో సామంతరాజుల్ని కూడగట్టుకుని బ్రిటిష్ వారిపై 1794లో చేసిన పోరాటం స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ యుద్ధంలో ఎంతోమంది బ్రిటిష్‌వారు చనిపోయారు. బ్రిటిష్ సైనికులు తుపాకులతో చేసిన పోరాటానికి వీరావేశంతో వచ్చిన వీరాధివీరులైన రాజుల చేతిలో చిక్కి విగతజీవులయ్యారు. తెలుగుజాతి ఆత్మాభిమానాన్ని నిలబెట్టడానికి, తెలుగుతేజాన్ని నిరూపించడానికి, బానిసబతుకుల్ని ఎదిరించాలన్న రాజుల పౌరుషాన్ని చూపించడానికి. పరాయి పాలకుల పీడను విరగడ చేయడానికి తెలుగువారి దాస్యశృంఖలాలు తొలగించడానికి చేసిన పోరాటం పద్మనాభయుద్ధంగా చరిత్రలో నిలిచిపోయింది.

భారతదేశంలో ఎన్నో ప్రాంతాల్లో ఎంతోమంది వీరులు పోరాటాలు చేశారు. ఈ దేశం మాది మీరు మీ దేశం పొండని తిరుగుబాట్లకు పాల్పడ్డారు. బ్రిటిష్‌వారిని ఎదిరించి దేశభక్తులుగా నిలిచారు. ఇతర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది స్వాతంత్ర సమరయోధుల వీరగాథలు చరిత్రలో నిక్షిప్తం అయ్యాయి. అయితే విజయనగర రాజులు వీరోచిత పోరాట చరిత్ర పద్మనాభ యుద్ధానికి ఉంది. ఇతర ప్రాంతాలలో జరిగిన పోరాటాలతో పోలిస్తే విభిన్నమైన ఈ యుద్ధ చరిత్ర దాని నేపథ్యం చాలావరకు అజ్ఞాతంగానే ఉండిపోయింది. విశాఖ మాన్యుయేల్‌లో లార్డు కార్మికేల్ మాత్రం ఈ యుద్ధంలో చనిపోయిన వీరుల వివరాలను నిక్షిప్తం చేశారు. ఈ పద్మనాభ యుద్ధాన్ని స్కాట్లాండులో జరిగిన లాడెన్ సంఘటనతో చరిత్రకారులు పోలుస్తుంటారు. 1794లో జరిగిన ఈ యుద్ధం దాని చారిత్రక నేపథ్యంతో రాసిన నవల.

## కథా నేపథ్యం

**ఉత్తరాంధ్రలో** విజయనగరం, బొబ్బిలి రెండు సంస్థానాలుగా ఉండేవి. బ్రిటిష్‌వారు భారతదేశాన్ని పరిపాలించే సమయంలో ఈ రెండు సంస్థానాలు వేరువేరుగా బ్రిటిష్‌వారికి వారి పాలనకు అనుబంధంగా ఉండేవి. ఆనాడు చిన్నచిన్న రాజ్యాలు సామంతరాజులు బ్రిటిష్ వారికి సంవత్సరాంతంలో కప్పం కట్టి ఎవరి మట్టుకు వారు తమ రాజ్యాలను పరిపాలన సాగించేవారు. విజయనగరం, బొబ్బిలి సంస్థానాలు కూడా ఇదే విధానంలో పరిపాలన సాగించేవి.

ఆ సమయంలో విజయనగరం, బొబ్బిలి సంస్థానాలకు మధ్య విబేధాలు ఉండేవి. రాజ్య విస్తరణ ఆధిపత్యపోరు కొనసాగేది. వాటిని బ్రిటిష్ వారు తమ వేర్పాటు విధానాలు విభజించి పాలించు పద్ధతిలో పెంచి పోషించారు. దీంతో ఆధిపత్యపోరుకోసం రెండు సంస్థానాల మధ్య పోరాటం జరిగింది. ఈ చరిత్ర బొబ్బిలి యుద్ధంగా పేరు పొందింది. ఈ బొబ్బిలి యుద్ధంలో విజయనగర సంస్థానానికి చెందిన పెద విజయరామరాజు వీర మరణం పొందారు. ఓటమిని అంగీకరిస్తూ విజయనగర సేనలు వెనక్కి తిరిగి వచ్చాయి.

బొబ్బిలి యుద్ధం తర్వాత విజయనగర సంస్థానం బ్రిటిష్ వారికి పూర్తి హక్కుగా మారిపోయింది. వారి అజమాయిషీలోనే పరిపాలన సాగించవలసిన పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో రాజ్యాన్ని పరిపాలించ వలసిన సంస్థానాధిపతి పెద విజయరామరాజు లేనందువల్ల రాజ్యాన్ని తమలో కలుపుకుని నిర్వాహకునిగా బ్రిటిష్ అధికారిని నియమిస్తారన్న వర్తమానం వచ్చింది. ఆ సమయంలో తప్పనిసరి పరిస్థితుల్లో విజయనగరానికి పరిపాలకునిగా ఎవర్నయినా నియమించవలసిన అవసరం ఏర్పడింది. అందరూ కలిసి తాత్కాలికంగా ఆనందరాజు అనే వ్యక్తిని విజయనగర సంస్థానాధీశునిగా నియమించడానికి సంస్థానం ఒక తీర్మానం చేసి బ్రిటిష్‌వారికి పంపించింది. దీంతో వారు విజయనగరంలో బ్రిటిష్ పరిపాలకుడ్ని నియమించాలన్న తమ ప్రతిపాదనకు తాత్కాలికంగా పక్కన పెట్టారు. అయితే రాజ్యాధికారాన్ని స్వీకరించిన ఆనందరాజుకి కొద్దిరోజుల్లోనే మశూచి వ్యాధి సోకింది. ఆయన పరిపాలన ఎంతోకాలం చేయలేదు. ఈ వ్యాధిని నయం చేయడానికి బరంపురం, కలకత్తావంటి ప్రాంతాలకు మందుల కోసం సైనికుల్ని పంపించారు. అయినా ఫలితం కనిపించలేదు. ఆ తర్వాత కొద్దిరోజులకే ఆనందరాజు మశూచివ్యాధి తీవ్రమై మృతి చెందారు.

విజయనగర పరిపాలకుడు చనిపోవడంతో మళ్ళీ కథ మొదటికి వచ్చింది. అంతవరకు కాపాడుకుని వస్తున్న విజయనగర రాజ్యాన్ని మళ్ళీ బ్రిటిష్‌వారికి అప్పగించడాన్ని ఉత్తరాంధ్రకు చెందిన రాజులంతా ఇష్టపడలేదు. ఆ సమయంలో మళ్ళీ సంస్థానాధీశుడ్ని నియమించవలసిన అవసరం ఏర్పడింది.

భర్త పెదవిజయరామరాజు చనిపోయి పుట్టెడు దుఃఖంతో ఉన్న అతని భార్య చంద్రయ్యమ్మ తాత్కాలికంగా రాజుగా వ్యవహరించిన ఆనందరాజు మసూచితో మృతిచెందడంతో ఖిన్నురాలైంది. రాజ్యపరిపాలన విషయంలో ఏమి చేయాలో తెలియని పరిస్థితిని ఎదుర్కొంది. ఆమెకు పిల్లలు లేనందువల్ల వారసత్వం కోసం ఎవరినైనా దత్తత తీసుకోవాలని చాలామంది సలహాలు ఇచ్చారు. రాజులేని రాజ్యాన్ని కబళించడానికి ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్న విషయాన్ని చంద్రయ్యమ్మ గుర్తించింది. వేరే ఇంటిపేర్లు కలిగిన ఇతరులెవరినైనా దత్తత తీసుకుంటే సమస్యలు వస్తాయని పూసపాటి వంశానికి చెందిన వారినే దత్తత తీసుకోవాలని బంధువులు సలహా ఇచ్చారు. పసిపిల్లాడిని దత్తత తీసుకుంటే అతను పెరిగి పెద్దవాడై అందివచ్చేంతవరకు పరిపాలన కష్టం అవుతుందని, బ్రిటిష్ వారితో ఇబ్బంది కూడా ఎదురవుతుందని చెప్పారు. దీంతో విజయనగర సంస్థాన వారసుని కోసం తీవ్రస్థాయిలో అన్వేషణ మొదలైంది.

విజయనగరం జిల్లాలో వివిధ ప్రాంతాలను పర్యటించి బంధువర్గాన్ని సంప్రదింపులు జరిపారు. ఆ సమయంలో చంద్రయ్యమ్మ రాజమహేంద్రవరానికి బయలుదేరి మార్గమధ్యమంలో కశింకోట సమీపంలో తాళ్ళపాలెం వద్ద ఆగారు. అక్కడ విడిది చేసిన సమయంలో పూసపాటి ఇంటిపేరు కలిగిన పేద రాజుల కుటుంబానికి చెందిన పూసపాటి వెంకటపతిరాజు అనే పన్నెండు సంవత్సరాల బాలుడ్ని దత్తత

తీసుకున్నారు. అతను ఆ ప్రాంతంలో ఉంటున్న పూసపాటి రామభద్రరాజు రెండవ కుమారుడు. ఇతని తల్లి బంగారయ్యమ్మ ఉప్పలపాటి వంశస్తురాలు. అతడ్ని విజయనగరం తీసుకుని వచ్చి అన్ని దత్తత లాంచనాలను పూర్తిచేశారు. అయితే అప్పటి విజయనగర సంస్థానంలో అందరి పేరు విజయరామరాజు అని ఉండాలన్న సంప్రదాయం ఉంది. వారి అసలు పేరు ఏదైనప్పటికీ విజయరామరాజుగా మార్పు చేసి ఒకటవ రెండవ అని పేరు ముందు తగిలించేవారు. పెద విజయరామరాజు చనిపోవడం దత్తత తీసుకున్న వ్యక్తి చిన్నవాడు కావడం పెద విజయరామరాజుకు కొడుకుగా దత్తత అవడం వల్ల వెంకటపతిరాజు పేరుని చిన విజయరామరాజుగా మార్పు చేసారు. అతను చిన్న వయస్సులో ఉన్నప్పటికీ అతనికి విజయనగర సంస్థానానికి అధిపతిగా పట్టాభిషేకం చేశారు.

రాజ్యపరిపాలకునిగా చిన్నవాడైనా విజయరామరాజుని దత్తత ద్వారా నియమించడం జరిగిందని, అందువల్ల రాజు లేడని రాజ్యంపై దండెత్తవద్దని చంద్రయ్యమ్మ అప్పటికే భారతదేశంలో ప్రాపకాన్ని సంపాదించిన ఈస్టుఇండియా కంపెనీ అధికారులను కోరింది. ఈ మేరకు ఆనాటి విజయనగరం సర్వసైనాధ్యక్షుడు పూసపాటి రఘునాధరాజు, ప్రధాన దివాన్ బుర్రా బుచ్చెన్న, సహాయ దివాన్ గుండాల అప్పాజీలు ప్రధానపాత్ర వహించి రాజీ కుదిర్చారు.

ఈవిధంగా దత్తత తీసుకోబడి విజయనగర సంస్థానానికి రాజుగా సింహాసనాన్ని అధిష్టించిన చిన విజయరామరాజే పద్మనాభ యుద్ధంలో కీలకపాత్రధారి. యుద్ధవీరుడు. భారతీయులపట్ల బ్రిటిష్ వారి విధానాలను, చిన్నతనం నుంచి వ్యతిరేకించిన వ్యక్తిగా పేరుపొందాడు. తుపాకులు మరఫిరంగులు సుశిక్షితులైన సైనికబలగం కలిగిన ఈస్టుఇండియా కంపెనీగా చెప్పబడిన ఆనాటి బ్రిటిష్ వారిని వారి సైన్యాన్ని ఎదిరించడానికి ఆయన చేసిన సాహసం గొప్పగా చెబుతారు. అప్పటికి భారతదేశంలో కాలుపెట్టిన ఈస్టు ఇండియా కంపెనీ వారి వైఖరిని ఎదురించి బెంగాల్‌లో మూడు తిరుగుబాట్లు జరిగాయి. ఆంధ్ర రాష్ట్రంలో కూడా ఏకైక తిరుగుబాటు జరిగింది. ఆ తిరుగుబాటు విజయరామరాజు చేసిన పద్మనాభ యుద్ధమే. ఇతర ప్రాంతాలలో ఉన్న తన మిత్రులైన సామంతరాజులను, ఈస్టు ఇండియా కంపెనీకి చెందిన బ్రిటిష్ పాలకుల విధానాలను వ్యతిరేకించే చిన్న చిన్న సంస్థానాధీశులను కూడగట్టుకోవడం వంటి పనులకు ఆద్యునిగా నిలిచారు.

ఆనాటి పరిస్థితులలో ఈస్టుఇండియా కంపెనీ వారిని ఎదిరించడానికి భారతదేశంలో రాజులు సంస్థానాధీశులు ఎవరూ సాహసం చేయలేని విధంగా ఉండేవి. వారు చెప్పిందే వేదం. వారు చేసినదే శాసనం అనే విధంగా కార్యకలాపాలను నిర్వహించేవారు. వారు తీసుకున్న ఏ నిర్ణయాలైనా ఎవరైనా ఎదురిస్తే వారిని అష్టకష్టాలు పెట్టడానికి ప్రయత్నాలు చేసేవారు.

అటువంటి పరిస్థితుల్లో విజయనగరం సంస్థానంపై వారు చేసిన కుట్రను సమర్ధంగా ఎదిరించడానికి విజయరామరాజు నడుం బిగించారు. ఆ ఎదిరింపు ఎంతో సాహసంతో కూడుకున్నదన్న విషయం తెలుసు కానీ తనకు వెన్నుదన్నుగా ఉన్న పధ్నాలుగు చిన్న సంస్థానాలు చెందిన క్షత్రియ వీరులను వందలాది మంది రాజులను కలుపుకుని వంటరి పోరాటం చేసారు. విజయమో వీరస్వర్గమో అనే విధంగా యుద్ధానికి శ్రీకారం చుట్టారు.

మాతృదేశంపై ప్రేమతో ఎంతోమంది క్షత్రియ వీరులు కదనరంగంలోకి దిగారు. ఆత్మవిశ్వాసంలో ముందుకు కదిలారు. బలవంతులైన సైనిక శక్తిపరులైన బ్రిటిష్ సేనల్ని ఎంతోమందిని మట్టి కరిపించారు. ఆ వీరోచిత పోరాటంలో రక్తం ఏరులై పారింది. యుద్ధవీరులు రుధిరం చిందిన ఆ రక్తభూమిలో రాజులు చేసిన పోరాటమే పద్మనాభ యుద్ధంగా పేరుపొందింది.

## *మొదటి అధ్యాయం*

***బాల్యంలో వెంకటపతిరాజు***

సాయంత్రం ఆరుగంటలు

ఆకాశం మేఘాల దుప్పటి కప్పుకుంది. చల్లగా వీస్తున్న గాలి శరీరానికి హాయినికలిగిస్తోంది. ఆహారం కోసం సుదూర తీరాలకు వెళ్ళిన పక్షులు ఆకాశంలో గుంపులు గుంపులుగా ఎగురుతున్నాయి.

కోట బురుజులోంచి దూరంగా కనిపిస్తున్న సైనిక విన్యాసాలు ముగిసిపోయినట్లుగా శబ్దాలు తగ్గిపోయాయి. ఆయుధాలను సర్దుకుంటున్న సైనికులు ఒకొక్కరు ముందుకు కదులుతున్నారు. సేనాని కుమందాన్ అందర్నీ లెక్కించి వారికి బాధ్యతల్ని అప్పగిస్తున్నాడు.

చిన విజయరామరాజు ఆలోచిస్తున్నాడు.

దేశంలో జరుగుతున్న అల్లకల్లోలాలు అశాంతులు అతనికి ఆందోళన కలిగిస్తున్నాయి. పన్నెండు సంవత్సరాల వయసులో చదువు ఆగిపోయింది. ఎక్కడో పల్లెటూళ్ళో ఆనందంగా గడపవలసిన జీవితం హఠాత్తుగా మార్పు చెందింది. అదృష్టం వెతుక్కుని వచ్చి సంస్థానాధిపతిని చేసింది. రాజ్యాధిపతిగా అవకాశం వచ్చిందని స్నేహితులంతా అభినందించారు. విజయనగరం నుంచి వచ్చిన పల్లకీలో తనను ఎక్కించుకుని తీసుకుని వెళుతుంటే వారంతా తనకు బాగా దూరం అయిపోతున్నారని మనసు బాధగా మూలిగింది. అయినా చుట్టూ ఉన్న సైనికులు, మందీ మార్బలం అభినందనలతో ముంచెత్తుతూ ముందుకు సాగిపోయారు.

వెళుతున్నప్పుడు కన్నతల్లి బంగారయ్యమ్మ దీనంగా చూసింది.

రోజూ ఆమె తన చేతితో కొడుక్కి గోరుముద్దలు తినిపించేది. ఇంట్లో ఉన్న ఎప్పటిదో పాతపందిరి మంచం మీద ఎప్పుడూ అమ్మ పక్కనే ముడుచుకుని పడుకునేవాడు. విజయనగరం సంస్థానానికి వెళ్ళిపోతున్నందున మనసులో బాధపడ్డాడు. కొత్తప్రదేశం, అధికారం హోదాతో అక్కడ ఎలా ఉంటుందోనని మనసు పరిపరివిధాలుగా ఆలోచించింది.

"బెంగపడకురా కన్నా. అక్కడ ఇంకా బాగుంటుంది. నువ్వు పుట్టినప్పుడే మహర్జాతకుడివని అన్నారు. విజయనగరం నుంచి రాజులంతా వచ్చి నువ్వు దత్తుడివి అవ్వాలని కోరినప్పుడు అది నిజమవుతుందని అర్థమైంది. "బంగారయ్యమ్మ అనునయించింది.

అయినా వెంకటపతిరాజులో ఏదో వెలితి.

ఇంటిలో వంటలు చేయడానికి బైరేగి బావాజీ అనే ముసలి వ్యక్తి ఉండేవాడు. అప్పుడప్పుడు వేటకు వెళ్ళి అడవిపంది, దుప్పి మాంసం, పికిలి పిట్టల మాంసం తెచ్చి చాలారుచిగా వండేవాడు. వెళుతున్నప్పుడు తన దగ్గరికి వచ్చి "బాబూ నాకంటే రుచిగా వండేవారు ఎంతోమంది దివాణంలో ఉంటారు. ఇక్కడైతే నేను తెస్తేనే వేటమాంసం. అక్కడలా కాదు. నువ్వు ఏది కావాలంటే అది క్షణాల్లో అమర్చిపెట్టేవారు, నీమాట కోసం ఎదురుచూసేవారు ఎంతోమంది ఉంటారు" మెల్లగా అన్నారు.

ఆ తర్వాత వెంకటపతిరాజు భయం భయంగా పల్లకీ ఎక్కాడు.

ఇంట్లోవారు, బంధువులు వీడ్కోలు పలికారు. తనతో చదువుకున్న స్నేహితులు దూరంగా నిల్చుని బెరుగ్గా చూసారు. తలపాగాలు చుట్టుకున్న సైనికుల్ని వారి వెంట వచ్చిన రెండు చిన్నపాటి గుర్రాలు పూన్చిన రధాలను వింతగా చూస్తున్నారు.

"మళ్ళీ ఎప్పుడైనా వస్తాలే.."

అతని మాట గొంతులోనే ఉండిపోయింది. బైటికి రాలేదు.

బోయీలు లేచారు.

పల్లకీలు కదిలాయి. అందరికీ భారంగా, బాధగా వీడ్కోలు పలికాడు.

జరిగిపోయిన సంఘటనలు తెరలు తెరలుగా గుర్తుకు వస్తుంటే వెంకటపతిరాజుకు కన్నీళ్ళు ఉబికాయి. మనసంతా బాధగా భారంగా అయిపోయినట్లయింది.

"వర్షం వస్తుందేమో. లోపలికి వెళదమా?" విజయరామరాజు వ్యక్తిగత సహాయకుడు దగ్గరికి వచ్చి చెప్పాడు. కుర్చీలో కూర్చున్న రాజు లేవలేదు. తలెత్తి వచ్చిన వ్యక్తివైపు సూటిగా చూడలేకపోయాడు.

విజయరామరాజుకి సంబంధించిన సమస్త వ్యవహారాలు చూసే అతని పేరు నారాయణాద్రి. అతడ్ని చూస్తుంటే తన ఇంటిలో వంటలు చేసే బైరేగి బావాజీయే గుర్తుకు వస్తుంటాడు. అందుకే తనలో భావాలను అతనికి తెలియకూడదని అనుకున్నాడు.

"తమరు దుఃఖిస్తున్నారా?" నారాయణాద్రి అడగలేక అడిగాడు.

విజయరామరాజు ఏమీ సమాధానం చెప్పలేదు. "లేదు.. లేదు ఆకాశం వైపు చూస్తున్నాను.. మీరు పదండి" అన్నాడు నెమ్మదిగా.

నారాయణాద్రి కదలలేదు.

కోటను ఆనుకుని ఉన్న బరుజు మహల్‌లో కొంతమంది సిబ్బంది పనులకు ఉపక్రమిస్తున్నారు. పక్కనున్న మరో భవంతిలో షెహనాయి వాద్యం మంద్రంగా వినిపిస్తోంది. కోట లోపల హడావుడి తగ్గుతోంది.

సంధ్యావందనం అయిపోయి కొంతమంది లోపలకు వస్తున్నారు.

"అమ్మగారు మీకోసం చూస్తుంటారు. రాత్రి భోజనాలకు ఏర్పాట్లు చేయమన్నారు. అందుకే తమకు గుర్తుచేస్తున్నాను" నారాయణాద్రి జవాబుకోసం చూడకుండా దూరంగా నిల్చుని చేతులు కట్టుకున్నాడు.

ఇంతవరకు సామాన్యమైన కుటుంబంలో సాధారణ వ్యక్తిగా ఉన్న తనకు పెద్ద వయసువారినుంచి తనకన్నా విజ్ఞానవంతులు నుంచి మర్యాద లభించడం ఏదోలా ఉంది. అనుకోకుండా కలిసి వచ్చిన అదృష్టమా! కలలు కనని సౌభాగ్యమా! అర్థం కావడంలేదు.

మెల్లగా లేచి నిల్చున్నాడు.

విజయరామరాజు లోపలికి రావడానికి సిద్ధపడ్డాడని గుర్తించి వెంకటాద్రి ముందుకు కదిలాడు. ఇతర సిబ్బంది కూడా అనుసరించారు.

### *సవతి తల్లి ప్రేమ*

చంద్రయ్యమ్మ పిఠాపురం ప్రాంతానికి చెందిన యువతి. చిన్నతనం నుంచి అల్లారుముద్దుగా పెరిగింది. తండ్రికి ఒక్కతే కూతురు. మంచి సంబంధం చూసి పెళ్ళిచేయాలని ఇంట్లో వారు ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఆ సమయంలో విజయనగరం సంబంధం వచ్చింది. చాలామంది విజయనగరం రాజావారితో వియ్యమొందాలని సూచించారు.

విజయనగరానికి కాబోయే సంస్థానాధీశుడు పెద విజయరామరాజుతో సంబంధం తూగగలమా అని సందేహించాడు. అయినా తనకున్న రెండువందల ఎకరాలకు ఇతర జవహరీని కట్నంగా అందించయినా చుట్టరికం కలుపుకోవాలని అనుకున్నాడు. రాయబారాలుసాగాయి. మధ్యవర్తులు పిఠాపురంలో ఉంటున్న చంద్రయ్యమ్మ అందచందాలు గురించి, వారి కుటుంబం గురించి గొప్పగా చెప్పడంతో ఇరువర్గీయులకు మధ్య అంగీకారం కుదిరింది.

ఫలితంగా 1742లో పెద విజయరామరాజు, చంద్రయ్యమ్మల వివాహం అతి వైభవంగా జరిగింది. కూతురుకోసం ఆమె తండ్రి భారీగా కట్నకానుకలు అందించారు. వివాహానికి తెలుగునేల నలుమూలలనుంచి రాజులు, సామంతరాజులు విశేషంగా వచ్చారు.

ఆ తర్వాత చంద్రయ్యమ్మ కాపురానికి వచ్చింది.

సాధారణ కుటుంబం నుంచి ఉన్నతమైన కుటుంబంలో సంస్థానాధిపతికి భార్యగా రావడం ఆమెకు ఎంతో ఆనందం కలిగించింది.

విజయనగరం కోటలో నివాసం.

కొత్త కాపురం సజావుగా ప్రారంభమైంది.

ఉత్తరాంధ్రలో ఉన్న రాజ్యాలలో విజయనగరానికి మంచిపేరు ఉంది. రాజ్యంతో పాటు ఆమె భర్త పెదవిజయరామరాజుకు కూడా అంతే పేరు ఉండేది. విజయనగరం నుంచి పుట్టింటికి మేనాలో వెళుతుంటే ఆమెకు ఎంతో గర్వంగా ఉండేది. విజయనగరం కోటనుంచి బయలుదేరిన గుర్రాల బళ్ళు నీళ్ళకుండీలు వద్ద (ప్రస్తుతం ఆనందపురం మండలం) విశ్రాంతికోసం ఆగడం అక్కడ చుట్టుపక్కలవారు రాజుగారి సతీమణి యువరాణి వచ్చిందని సంబరపడటం, చెలికత్తెలకు మాత్రమే దర్శనభాగ్యం కలిగే విధంగా కట్టుదిట్టమైన భద్రత ఆమెకు ఎంతో ఇష్టంగా గర్వంగా అనిపించేవి.

పెళ్ళి జరిగి సంవత్సరాలు గడిచిపోయాయి. రానురాను కాలం గడుస్తుంటే ఆమెలో ఒకలాంటి నిర్లిప్తత ఆవరించింది. సకల సౌకర్యాలు. పిలిస్తే పలికి సమస్త సేవలు అందించే మందీమార్బలం ఆమె చుట్టూ ఉన్నా ఏదో వెలితి.

మనసులో పేరుకుపోయిన శూన్యం.

తన అసంతృప్తికి కారణం సంతానలేమి అనే విషయం గుర్తించింది.

ఆ విషయం పదేపదే మనసులో సుళ్ళు తిరిగేది.

నిత్యం పరిపాలనా వ్యవహారాలలో మునిగి తేలే పెదవిజయరామరాజుకి భార్య బాగోగులు పట్టించుకోవడానికి కాని గుర్తించడానికి కానీ సమయం చిక్కేదికాదు. ప్రతిరోజూ ఎంతో వంటరితనంతో బాధపడే ఆమె వేదన ఆయన తెలుసుకోవడానికి చాలా సమయం పట్టింది. పిల్లలు లేరన్న బాధకన్నా రాజ్యానికి వారసుడు లేడన్న ఆవేదన అతడి మనసుకు ములుకులా గుచ్చేది.

విజయనగరం సంస్థానానికి వారసులు లేరు.

రాజ్యాధిపతి నిస్సంతుడు కావడంవల్ల విజయనగర సంస్థానాన్ని స్వాధీనం చేసుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుందని ఈస్టు ఇండియా కంపెనీ వారు భావించేవారు.

ఆ సమయంలోనే బొబ్బిలి రాజులతో యుద్ధం చేయవలసి వచ్చింది. ఆ యుద్ధంలో అతను వీరమరణం పొందాడు.

అప్పటినుంచీ చంద్రయ్యమ్మకు కష్టాలు మొదలయ్యాయి.

మనసు విప్పి మాట్లాడేందుకు భర్తలేడు.

కష్టం సుఖం చెప్పేందుకు పిల్లలు లేరు.

ఆ సమయంలో ఎంతో వేదనను అనుభవించింది.

రాజ్యాన్ని స్వాధీనం చేసుకోవడానికి ఈస్టుఇండియా కంపెనీకి చెందిన బ్రిటిష్‌వారు ప్రయత్నాలు చేస్తున్నారని తెలుసుకున్న తర్వాత మనసంతా వ్యాకులం చెందేది.

ఆ సమయంలో దత్తత తీసుకున్న వెంకటపతిరాజు ఆ ఇంటికి వచ్చాడు

పదమూడేళ్ళ కుర్రవాడు. ఎర్రగా లావుగా ఉన్నాడు వయస్సుకి మించిన రూపంతో ముద్దుగా ఉండేవాడు వెంకటపతిరాజు. దివాణానికి వచ్చిన తర్వాత చంద్రయ్యమ్మను అమ్మా అని పిలిచే చనువు అతనికి కలగలేదు. బాబు అంటూ దగ్గరికి తీసుకున్నంత ప్రేమ ఆమెకు అనిపించేదికాదు.

అయినా రాజ్యం కోసం రాజీపడింది.

దత్తుణ్ని సొంత పుత్రుడిగా భావించింది.

దివాణంలో రోజూ కొడుకుతో కలిసి భోజనం చేయడం అలవాటు చేసుకుంది. అంతవరకు భర్తలేని వంటరితనంతో ఏ పనీ ఉత్సాహంగా చేయాలనిపించేదికాదు. ఆమె ఎప్పుడు భోజనం చేస్తుందో ఆమెకే తెలియని పరిస్థితిలో ఉండేది. కొడుకు ఇంటికి రావడంతో అతనిపై ప్రేమను పెంచుకుంది.



చిన విజయరామరాజు. ఇతను ఈ నవలలో కథానాయకుడు. నాడు ఫోటోలు లేనందువల్ల విజయనగరం సంస్థానాధీశులు ఈ రాజు ఫోటోను వందసంవత్సరాల క్రితం చిత్రరూపంలో గీయించి ఉంచారు. విజయరామరాజు ఇలా ఉంటాడన్నది అంచనాగా తయారుచేసిన చిత్రం.

రాజ్యానికి అధిపతిగా ఉన్నందున అతనికి కొన్ని వ్యవహారాలు ఉంటాయి వాటిని నిర్వర్తించవలసి ఉంటుంది. దానిని నేర్పించడానికి తల్లిగా కొన్ని చేసింది.

దత్తత అనంతరం విజయనగరం వచ్చిన వెంకటపతిరాజుకు కిందస్థాయి ఉద్యోగులు, దండనాయకులు, సన్నిహితంగా మెలిగే కుటుంబ సభ్యులు గురించి కొన్ని విషయాలు చెప్పి అతడ్ని పరిపాలకునిగా తీర్చిదిద్దడానికి ప్రయత్నాలు చేసింది.

రోజూ రాత్రిపూట కొడుకుతోపాటు కూర్చుని భోజనం చేయడానికి అలవాటుగా చేసుకున్న చంద్రయ్యమ్మ ఆలోచనల్లో ఉండగానే వెంకటపతిరాజు అక్కడికి వచ్చాడు. రాజ్యానికి పరిపాలనుకు అతని పేరు చిన విజయరామరాజుగా మార్చుకున్నా ఆ ఇంట్లో కుటుంబసభ్యులు మాత్రం చినరాజాగా పిలిచేవారు.

"రోజూ మీరు నాకోసం ఎదురు చూడటం. నాతో కలిసి భోజనం చేయడం. మీకు ఇబ్బంది అవుతుంది అమ్మయ్యా" వెంకటపతిరాజు నెమ్మదిగా అన్నాడు.

"పర్వాలేదు. వంటరిగా భోజనం చేయడం ఏదోలా ఉంటుంది. మీ బావాజీ(తండ్రిని బావాజీ అని పిలిచేవారు) ఉన్నప్పుడు ఈ ఇబ్బంది ఉండేది కాదు. నాకు ఉన్నది మీరేకదా! అందుకే కలిసి తినాలన్నది నా కోరిక" చంద్రయ్యమ్మ అనునయంగా చెప్పింది.

మరేమీ మాట్లాడలేకపోయాడు వెంకటపతిరాజు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments